రేపు జడ్పీ స్థాయి సంఘాల సమావేశం

కొత్తగూడెం టౌన్, మే 14: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాన్ని ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు గ్రామీణాభివృద్ధి స్థాయి కమిటీ, 10.30 గంటలకు వ్యవసాయ స్థాయి కమిటీ, 11 గంటలకు విద్యా, వైద్యసేవల స్థాయి కమిటీ, 11.30 గంటలకు మహిళా సంక్షేమ స్థాయి కమిటీ, మధ్యాహ్నం 12 గంటలకు సాంఘిక సంక్షేమ స్థాయి కమిటీ, 12.30 గంటలకు మండల స్థాయి కమిటీ, ఒంటి గంటకు ప్రణాళిక, ఆర్థిక స్థాయి కమిటీ సమావేశాలు జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో జరుగనున్నాయని తెలిపారు. జడ్పీటీసీలు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, మే 14: ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీబీఎస్ఈ సిలబస్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గండుగులపల్లిలోని ఈఎంఆర్ఎస్ (బాలికలు) ఎంపీసీలో 9, సీఈసీలో 27 సీట్లు ఉన్నాయని ఆసక్తి గలవారు 9948933010 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఈఎంఆర్ఎస్ పాల్వంచ (బాలికలు) ఎంపీసీలో 6, బైపీసీ 1, సీఈసీలో 26 (8317556834) ఈఎంఆర్ఎస్ గుండాల (బాలికలు) ఎంపీసీలో 7, సీఈసీలో 26 సీట్లు ఉన్నాయని (8978556948), ఈఎంఆర్ఎస్ టేకులపల్లిలో (బాలురు) బైపీసీలో 15, సీఈసీలో 15 (7032266792), ఈఎంఆర్ఎస్ దుమ్ముగూడెం (బాలురు/బాలికలు) ఎంపీసీలో 9 సీట్లకు బాలురకు 2, బాలికలకు 7, బైపీసీలో 11 సీట్లు, హెచ్ఈసీలో 12 సీట్లకు బాలురకు 7, బాలికలకు 8 (9885871670) సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. చర్ల, ములకలపల్లి, సింగరేణిలో సీట్లు ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈఎంఆర్ఎస్ విద్యాలయాల్లో సమర్పించాలని తెలిపారు. ఈ నెల 22న ఈఎంఆర్ఎస్ చర్ల@భద్రాచలంలో కౌన్సెలింగ్ జరుగనున్నట్లు ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ పేర్కొన్నారు.

జూన్ 8న జాతీయ లోక్ అదాలత్

జిల్లా జడ్జి భానుమతి

కొత్తగూడెం టౌన్, మే 14: జిల్లా కోర్టులో వచ్చే నెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిడెంట్, సివిల్, చీటింగ్, చిట్‌ఫండ్, భూతగాదాల, దొంగతనం కేసులు, ట్రాఫిక్ చలాన్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు తదితర కేసులు లోక్ అదాలత్‌లో రాజీ చేసువచ్చిని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి అమానుషం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మే 14: కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులకు రావాల్సిన రెమ్యునరేషన్ అడిగిన ఉద్యోగులపై లాఠీఛార్జి చేయడం అమానుషమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రవి పేర్కొన్నారు. లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటుం అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మణుగూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **పంపన నత్యనారాయణ** S/o **పంపన సూర్యనారాయణ**, వయస్సు : 36సం॥లు,నివాసం: ఇ,.నెం.1-20, మొండికుంట గ్రామంచ నెల్లిపాక శివారు, అశ్వాపురం మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించు కున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిస్ట్రారు, ఖమ్మం బూర్గంపహాడ్ రిజిస్ట్రారు వారి పరిధిలో గల భద్రాద్రి కొత్గూడెం జిల్లా,అశ్వాపురం మండలం, ప్రజా పరిషత్‌లోని నెల్లిపాక శివారు మొండికుంట గ్రామ పంచాయితీకి చెందిన ఇంటి నెం.8-26, డాక్యుమెంట్ నెం. : **63/2019**, నకు సంబంధించిన ఖాళీ స్థలము విస్తీర్ణము : 676.33 చ॥గ॥ గల ఖాళీ స్థలమునకు హద్దులు : **తూర్పు** : పర్వత సంజీవరావు గారి ఇల్లు. **పడమర** : పర్వత బ్రదర్స్ మరియు యాసా సాంబిరెడ్డి ఇంటి స్థలం, **ఉత్తరం** : కొడెం సుదర్శన్ కొడెం సాంబయ్య ఇంటి స్థలము, **దక్షిణం** : 12 అడుగుల వెడల్పు గల దారి.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

పేదల పట్ల దయా, కరుణ కలిగి ఉండాలి

మధిర, మే 14 : పేదల పట్ల దయ, కరుణ కలిగి ఉండాలని ప్రముఖ వ్యాపారవేత్త, గాయకుడు పుల్లఖండం చంద్రశేఖర్ కోరారు. మంగళవారం ఉదయం పట్టణంలో స్థానిక టీవీఎం హైస్కూల్ టీవీఎం వాకర్స్ క్లబ్ తరపున సభ్యులు, చంద్రశేఖర్ 20 పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవతా దృక్పథంతో ముందుకు సాగుతూ ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజిక సేవకుడు లంకా కొండయ్య, వాకర్స్‌క్లబ్ సభ్యులు, సేవాఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దౌర్జన్యం.. ఖాకీ కావరం..

- సోమవారం పోలింగ్ బూత్‌లోకి సెల్‌ఫోన్‌తో కాంగ్రెస్ నేత
- కానిస్టేబుల్‌కు సమాచారం ఇచ్చిన బీఆర్ఎస్ కార్యకర్త నవీన్
- కాంగ్రెస్ నేత సూచనతో నవీన్‌పై మంగళ వారం సీఐ దాడి
- ప్రశ్నించిన అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు
- సరైన సమాధానం లేకపోవడంతో స్టేషన్ ఎదుట ధర్నా, రాస్తారోకో

మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు నేతృత్వంలో పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నేతలు, ఆదివాసీ నాయకులు

అశ్వారావుపేట, మే 14: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలో బీఆర్ఎస్ కార్యకర్తపై సీఐ దాడి చేయడాన్ని నిరసిస్తూ అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు నేతృత్వంలో బీఆర్ఎస్, ఆదివాసీ నాయకులు ఆందోళన చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నా, రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే పోలీసులు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ఫిర్యాదు అందిందని, ఎన్నికల బీజీలో స్వల్ప జాప్యం జరిగిందని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని సీఐ జితేందర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. మాజీ ఎమ్మెల్యే తాటి కథనం ప్రకారం..

భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం అనంతారం గ్రామంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరుగుతుండగా కాంగ్రెస్ నాయకుడు సూరిబాబు సెల్‌ఫోన్‌తో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లబోయాడు. బీఆర్ఎస్ కార్యకర్త గీగా నవీన్ ఈ విషయాన్ని గమనించి అక్కడే ఉన్న కానిస్టేబుల్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో కానిస్టేబుల్ స్పందించి సూరిబాబు వద్ద సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నాడు. దీంతో నవీన్‌పై సూరిబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడాడు. 'సెల్‌ఫోన్ పట్టిస్తావా? నీ అంతు చూస్తా?' అంటూ హెచ్చరించాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు నవీన్‌కు ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలంటూ పిలిచారు. దీంతో ఎంపీటీసీ భర్త పద్దం శ్రీనుతో కలిసి నవీన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. కొద్దిసేపటికి సీఐ జితేందర్‌రెడ్డి వచ్చి నవీన్‌ను కొట్టి పోలీస్ స్టేషన్లోనే నిర్బంధించారు. సాయంత్రం వరకు వదిలిపెట్టలేదు. ఈ సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు.. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. 'నవీన్‌ను ఎందుకు అదుపులోకి తీసుకున్నారు? ఎవరు ఫిర్యాదు చేశారు?' అంటూ నిలదీశారు. పోలీసుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో బీఆర్ఎస్, ఆదివాసీ నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో ఎస్సై శివరామకృష్ణ వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పి నిరసనను విరమింపజేశారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మాజీ జడ్పీటీసీ అంకత మల్లికార్జునరావు, బీఆర్ఎస్ నాయకులు కాసాని చంద్రమోహన్, మందపాటి రాజమోమన్‌రెడ్డి, మోటూరి మోహన్, సత్యవరపు సంపూర్ణ, బరగడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని సీఐ హామీ..

అనంతారం ఘటనపై ఫిర్యాదులు అందాయని, ఎన్నికల బీజీలో ఉన్నందున కొంత అలస్యమైందని సీఐ జితేందర్‌రెడ్డి అన్నారు. క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేస్తామని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుకు, బాధితుడు నవీన్‌కు హామీ ఇచ్చారు. ఇదే విషయమై సీఐని విలేకరులు వివరణ కోరగా.. బాధితుడిని కొట్టినట్లు చేసిన ఆరోపణ సరికాదని అన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అశ్వారావుపేటరూరల్, మే 14 : మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయ 28వ వార్షికోత్సవం సందర్భంగా కలశస్థాపన, అఖండ దీపారాధన, అష్టోత్తర శతనామ పూజ, కుంకుమార్చన, మహా నివేదన పూజలను పూజారి నిరంజనాచార్యులు నిర్వహించారు. సాయంత్రం వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. వినాయకపురం, ఆసుపాక, మామిళ్ల వారిగూడెం గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లొంగిపోయిన 30 మంది మావోయిస్టులు

9 మందిపై రూ.39 లక్షల రివార్డు

వివరాలు వెల్లడించిన బీజాపూర్ ఎస్పీ జితేంద్ర

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు

కొత్తగూడెం క్రైం, మే 14 : ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా విస్తరిస్తోన్న మావోయిస్టులపై కేంద్ర బలగాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. 'లోన్ వర్రుట్' పేరుతో మావోయిస్టులను నిర్మూలించే క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రతా బలగాలతో దండకారణ్యంపై దండయాత్ర చేస్తున్నాయి. నాలుగు నెలల కాలంలో జరిగిన యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో బస్తర్ రేంజ్ పరిధిలో సుమారు 110 మంది మావోయిస్టులు నేలకొరిగారు. వందలాది మంది దళ సభ్యులు, సానుభూతిపరులు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో 30 మంది మావోయిస్టులు జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్, సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఎస్‌కే మిశ్రా ఆధ్వర్యంలో లొంగిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అజ్ఞాతంలో ఉన్న 30 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు ఆయన తెలిపారు. వారిలో 9 మంది మావోయిస్టులపై రూ.39 లక్షల రివార్డులు ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో ఒకరిపై 18 అరెస్టు వారెంట్లు పెండింగ్‌లో ఉండగా.. మరొకరిపై 6 స్టే వారెంట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. వీరంతా పదిహేనేళ్లలో అనేక విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 180 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయగా.. 76 మంది లొంగిపోయినట్లు స్పష్టం చేశారు. భద్రతా దళాల నుంచి పెరుగుతున్న ఒత్తిడి కారణంగానే మావోయిస్టులు లొంగు'బాట' పడుతున్నారని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరపున వెంటనే రూ.25 వేల చొప్పున అందజేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. తద్వారా వారంతా జీవనోపాధి పొందేందుకు దోహదపడుతుందని వివరించారు.

'కాంగ్రెస్ భ్రష్టుపట్టడం ఖాయం'

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అశ్వారావుపేట, మే 14 : పూటకో పార్టీ మార్చే నాయకులను చేర్చుకోవడం వల్ల కాంగ్రెస్ పార్టీ భ్రష్టుపట్టిపోవడం ఖాయమని ఆ పార్టీ మండల నాయకులు మొగళ్ళపు చెన్నకేశవరావు, జ్యేష్ఠ సత్యనారాయణచౌదరి అన్నారు. మంగళవారం అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందంటే ఏ ఒక్కరి వల్లనో కాదని సమష్టిగా పనిచేస్తేనే సాధ్యమైందని అన్నారు. పార్టీలోకి వలసవాదులను ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో పార్టీ గడ్డు పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ అధిష్టానం నిజమైన పార్టీ విధేయులను కాపాడుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎస్‌కే బాష, సత్యవరపు బాలయ్య, సీహెచ్ సత్యనారాయణ, జల్లిపల్లి దేవరాజు, రాచకొండ బంగారం, ఎస్‌కే బషీర్, రమాదేవి, దాసరి రవి, సుకూర్, సురేశ్, మోహన్‌రావు పాల్గొన్నారు.

గొత్తికోయల కాలనీలో రక్త పరీక్షలు

రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అశ్వారావుపేటరూరల్, మే 14 : మండల పరిధిలోని బచ్చువారిగూడెం గ్రామ పంచాయతీలోని దట్టమైన అటవీప్రాంతంలో గల మలేరియా ప్రభావిత ప్రాంతాలైన రేగళ్ల, జిల్లేడుపాకల గొత్తికొయల కాలనీల్లో గుమ్మడవల్లి పీహెచ్‌సీ అధికారులు మంగళవారం ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. సుమారు 10 కిలోమీటర్లు అటవీ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించారు. రేగళ్లలో 118 మందికి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేశారు. జిల్లేడుపాకలలో 121మందికి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయగా ఒకరికి మలేరియా ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించారు. గుమ్మడవల్లి పీహెచ్‌సీలో గర్భిణులకు పలు సూచనలు చేశారు. వైద్యురాలు మధులిక ఆదేశాల మేరకు సబ్ యూనిట్ అధికారి ఆజ్మీరా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో హెచ్‌వీ దుర్గమ్మ, హెచ్ఏ భాస్కర్, వెంకటేశ్వర్లు, విజయరెడ్డి, ఏఎన్ఎంలు రేవతి, విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి 'దోస్త్' వెబ్ ఆప్షన్లు ప్రారంభం

ఖమ్మం ఎడ్యుకేషన్, మే 14: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం 'దోస్త్' (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) వెబ్ ఆప్షన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమవుతుందని ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. ప్రచార పోస్టర్‌ను మంగళవారం తమ కళాశాలలో ఆవిష్కరించి మాట్లాడారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు బుధవారం నుంచి వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చని తెలిపారు. ఈ నెల 25 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, 27 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉంటుందని వెల్లడించారు. మొదటి విడత సీట్లు కేటాయింపు ఫలితాలు జూన్ 3న వెలువడుతాయన్నారు.

2న ఖమ్మంలో పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ఖమ్మం సిటీ, మే 14: ఖమ్మం, భద్రాద్రి జిల్లాల జూనియర్, సీనియర్స్ ఓపెన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు జూన్ 2న జరుగనున్నాయని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ మనోజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రోత్సాహంలో కోసమే నిర్వహిస్తున్న ఈ పోటీలు ఖమ్మంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమవుతాయని అన్నారు. మహిళలు, పురుషుల విభాగాల్లోనూ, సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లోనూ జిల్లా ఓపెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపికైన వారు జూలై 6, 7 తేదీల్లో ఖమ్మంలో జరిగే సీనియర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత పొందుతారని తెలిపారు. క్రీడాకారులంతా రౌండ్ నెక్ టీషర్ట్స్, షార్ట్స్ ధరించి హాజరుకావాలని సూచించారు. టిఫిన్, భోజన వసతి కల్పిస్తామని వెల్లడించారు. ఎంట్రీ ఫీజు రూ.300 ఉంటుందని, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్లు తీసుకుని రావాలని సూచించారు.

'7వ తేదీలోపే వేతనాలు చెల్లించాలి'

ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇప్టూ నాయకులు

మణుగూరు, మే 14 : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతి నెలా 7వ తేదీలోపే వేతనాలు, పెన్షన్లు, సీఎంపీఎఫ్ వివరాలతో కూడిన వేతన స్లిప్పులు ఇవ్వాలని కోరుతూ ఇప్టూ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కురం నాగేశ్వరరావు మాట్లాడుతూ సివిల్‌తో ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కార్పొరేట్ ఆదేశాల ప్రకారం ప్రతి నెల 7వ తేదీన చెల్లించాలని నిబంధనలున్నాయని కానీ ఎక్కువమంది కాంట్రాక్టర్లు 15వ తేదీ నాటికి కూడా చెల్లించని పరిస్థితి ఉందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎం.రవి, తుపాకుల రాములు, రజబ్‌అలీ, కారం చందు, గుండాల శ్రీను, శివ కృష్ణ, దాసు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక

ఎన్నికైన ప్రగతిశీల కాంట్రాక్ట్ వర్కర్స్ మణుగూరు బ్రాంచి యూనియన్

మణుగూరు టౌన్, మే 14 : సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీని స్థానిక ఇప్టూ కార్యాలయంలో మంగళవార నిర్వహించారు. ఈ సందర్భంగా మణుగూరు బ్రాంచి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జానయ్య, ఉపాధ్యక్షుడిగా దేవి, కార్యదర్శిగా సంజీవరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఆర్.ప్రసాద్, కోశాధికారిగా విజయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యాకయ్యతోపాటు మరో ఐదుగురిని ఎన్నుకున్నట్లు ఇప్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదనరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.

శ్రీకృష్ణ మృతికి సంతాపం

కొత్తగూడెం టౌన్, మే 14: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతిచెందిన జడ్పీ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ పోలూరి శ్రీకృష్ణ మృతికి హన్మకొండ జడ్పీ సీఈవో మెరుగు విద్యాలత సంతాపం తెలిపారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారని, ఆయన మృతి తీరనిలోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, మే 14: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో మంగళవారం రామయ్యకు ఘనంగా నిత్య కల్యాణం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, తదితర నిత్య పూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం

మాట్లాడుతున్న మానె రామకృష్ణ

భద్రాచలం, మే 14: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు మానె రామకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ విజయం కోసం రెండు నెలలుగా నాయకులు, కార్యకర్తలు కష్టపడిన తీరు ప్రశంసనీయమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభించే ఏ పార్టీకి ఎక్కువ కాలం మనుగడ ఉండదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆకోజు సునీల్‌కుమార్, కోలా రాజు పాల్గొన్నారు.

క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న ఎస్‌కే సైదులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మే 14: వేసవిలో నిర్వహించే ఉచిత ఫిజియోథెరపీ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమ్మిళిత విద్యా కో ఆర్డినేటర్ ఎస్‌కే సైదులు అన్నారు. సుజాతనగర్ మండలంలోని ప్రాథమిక పాఠశాల, సుజాతనగర్‌లో ఉన్న భవిత కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. దివ్యాంగుల కోసం ప్రతి వారం మండల కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలను ఉచితంగా అందజేస్తామని, ఈ సదుపాయాన్ని 18 సంవత్సరాల్లోపు దివ్యాంగ పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమ్మిళిత విద్యా ఉపాధ్యాయులు శ్రావణ్ కుమార్, బేబీ, ఫిజియో థెరపిస్టు జ్యోతి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి

మోతీలాల్ (ఫైల్)

లక్ష్మీదేవిపల్లి, మే 14: ఇసుక ట్రాక్టర్ బోల్తా పడడంతో యువకుడు మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డిగుట్టకు చెందిన ధరావత్ మోతీలాల్ (24) తెలగరామవరం గ్రామానికి చెందిన పూర్ణచందర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కారుకొండ సమీపంలో జరుగుతున్న రహదారి పనులకు హేమచంద్రాపురం వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం డ్రైవర్ మోతీలాల్ ఖాళీ ట్రాక్టర్‌తో కారుకొండ వైపు వెళ్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోడను ఢీకొన్న ట్రాక్టర్ - ఇద్దరికి తీవ్రగాయలు

టేకులపల్లి, మే 14 : ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ సబ్‌స్టేషన్ గోడను ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని కోయగూడెం గ్రామానికి చెందిన పూన్నెం నాగరాజు, పోలెబోయిన వినోద్ మంగళవారం సాయంత్రం ట్రాక్టర్‌తో కోయగూడెం నుంచి రావూలపాడు వెళ్తున్నార